క్లుప్తంగా

అభివృద్ధి పనుల కోసం..

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. డీబీఎం38 కాల్వ, కోటంచ, బుగులోని జాతర అభివృద్ధి, నాపాక దేవాలయం, కోటగుళ్ల అభివృద్ధిపై అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్థిక సాయం



రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన రవి విద్యుత్‌షాక్‌తో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం శ్రీ బుగులోని వెంకటేశ్వరస్వామి ఆటో యూనియన్ సభ్యులు పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పోతిరెడ్డి సాంబయ్య, ఉపాధ్యక్షుడు బొంగు భిక్షపతి, కోశాధికారి మార్క కమాలకర్, కార్యవర్గ సభ్యులు రాజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'రేషన్‌కార్డు లేని వారికి అవకాశం కల్పించాలి'

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకంలో రేషన్‌కార్డులేని నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ప్రభుత్వానికి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించాలని రేషన్ కార్డు లేక చాలామంది ఇబ్బందులు పడుతున్నారన్నారు.

హనుమాన్ భక్తుల మాలధారణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు మాడుగుల బాపు శర్మ, పవన్‌శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు మంగళవారం మాలధారణ చేశారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో స్నానాలు చేసి ఆలయంలో పూజలు చేశారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు

కాళేశ్వరం: అసెంబ్లీలో ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడంతో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్‌మాదిగ ఆధ్వర్యంలో మహదేవపూర్ మండల కేంద్రంలో విజయోత్సవాలు మంగళవారం రాత్రి నిర్వహించుకున్నారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాజయ్య, రవితేజ, రాము, జక్కయ్య, సాగర్, సుశాంత్, గడ్డం స్వామి, శ్రీకాంత్, భిక్షపతి, సమ్మయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



కాటారం: మండలంలో పలు చోట్ల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు రికవరీ చేసి బాధితులకు మంగళవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన స్వాతి, సురేశ్, ఇబ్రహీంపల్లికి చెందిన బాపు, మల్హర్ మండలం రుద్రారానికి చెందిన రాజ్‌కుమార్, మహాముత్తారం మండలం ములుగుపల్లికి చెందిన లక్ష్మణ్ ఇటీవల మండల పరిధిలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అభినవ్, ప్రొబేషనరి ఎస్సై గీత అప్పగించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గణేశ్ పాల్గొన్నారు.

అవార్డు అందజేత

కాటారం: మండల కేంద్రంలోని గారెపల్లికి చెందిన సుంకరి శ్రీధర్‌పటేల్ ముంబాయిలో నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రిన్సిపాల్ మంగళవారం అవార్డు అందుకున్నారు. పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నేహ్వాల్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు శ్రీధర్ తెలిపారు. కాగా శ్రీధర్ గత కొన్నేళ్లుగా పూనేలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. శ్రీధర్ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని చిన్న బోయినపల్లి వద్ద భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుంచి అధికలోడుతో వస్తున్న ఇసుక లారీని రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు నాగేశ్వర్‌రావు, శంకర్‌తోపాటు పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. చిన్నబోయినపల్లి చెక్‌పోస్టు వద్ద ఇసుక లారీలను తనిఖీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

దుర్శన్ చెట్టే బస్‌షెల్టర్!

- రేగొండలో నిలువ నీడ కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు



చెట్టు నీడలో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

రేగొండ: మండల కేంద్రంలో ఉన్న దుర్శన్ చెట్టే ప్రయాణికులకు బస్ షెల్టర్‌గా నీడనిస్తుంది. పరకాల–భూపాలపల్లి ప్రధాన రోడ్డుపై ఉన్న రేగొండలో ఇప్పటి వరకు ప్రయాణికులకు నీడను కల్పించే ఆలోచన పాలకులకు రాకపోవడం విడ్డూరంగా ఉంది. ఉమ్మడి రేగొండ మండలంలోని 37 గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు వ్యాపార, అధికార కార్యాలయాలకు, వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తూ, పోతుంటారు. అలాగే మండల కేంద్రం నుంచి నిత్యం పరకాల, హనుమకొండ, హైదరాబాద్, భూపాలపల్లి, కాళేశ్వరం, ములుగు, చిట్యాల, టేకుమట్ల వంటి పట్టణాలకు కేంద్ర బిందువుగా ఉన్న రేగొండ మండల కేంద్రం నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. అలా ఎన్నో పట్టణాలకు అనుసంధానంగా ఉన్న మండల కేంద్రంలో ఇప్పటి వరకు బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

శిలాఫలకానికే పరిమితం

మండల కేంద్రంలో బస్‌షెల్టర్, సులభ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు పోలీస్ స్టేషన్ ఎదురుగా మూడు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటి వరకు ఎలాంటి పనులు కొనసాగలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



ప్రజాసమస్యలపై పట్టింపు లేని పాలకుల వల్లే దశాబ్దాలుగా మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణం జరగలేదు. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు బస్సు కోసం ఎండలో దుకాణాల ఎదుట వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– పెండ్యాల రాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందిస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది సొల్లేటి రాములు ఇటీవల ప్రమాదవశాత్తు చలివాగులో పడి మృతి చెందాడు. కాగా మృతుడు పోస్టల్ శాఖలో గతంలో రూ.699తో బజాజ్ గ్రూప్ ఆక్సిడెంట్ పాలసీ చేసుకోగా అతడికి రూ.10లక్షల బీమా చెక్కు మంజూరైంది. దీంతో మంగళవారం హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ హన్మంత్, సబ్ విజన్ భూపాలపల్లి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టల్ రామకృష్ణ బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ హనుమకొండ మేనేజర్ ప్రమోద్, లింగమూర్తి, మండల ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్, బీపీఎం అనిల్, అంజయ్య, మొగిళి, భాస్కర్, రామకృష్ణ, ఈపీఎం రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ఏటూరునాగారం: అధికార పార్టీలో ఉన్న నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలే కాని వ్యక్తిగత విమర్శలు చేసి పెద్ద గొప్ప అనుకోవడం అవివేకమవుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య, తాడూరి రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టౌన్ అధ్యక్షుడు ఖాజాపాషా అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరావు సమావేశంలో మాట్లాడిన మాటలను వక్రీకరించి వ్యక్తిగతంగా దూషించడం సరికాదన్నారు. ములుగు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే గెలవకున్నా ములుగును జిల్లాగా కేసీఆర్ ప్రకటించారన్నారు. ప్రజా సమస్యలు, జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దృష్టి పెట్టాలే తప్పా వ్యక్తిగత ఆరోపణలు చేసుకొని వారి స్థాయిని దిగజార్చుకోవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, అశోక్, సప్పిడి రాంనర్సయ్య, కాళ్ల రామకృష్ణ, ఖలీల్, బోజారావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

- మండల ప్రత్యేక అధికారి నరేశ్



స్టోర్‌రూంను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నరేశ్

కాటారం: ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి నరేశ్ తెలిపారు. కాటారం మండలం మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం డీఆర్‌డీఓ అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత, తరగతి, హాస్టల్ గదులు, కంప్యూటర్ రూం, వంట గది, డైనింగ్‌హాల్, ఆర్‌ఓ ప్లాంట్, టాయిలెట్స్, శానిటేషన్ పనులను పరిశీలించారు. తరగతుల నిర్వహణ, మెనూ అమలు తీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ వహించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. డీఆర్‌డీఓ వెంట ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శి రాకేశ్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కాటారం: పదో తరగతి పరీక్షలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, ఆదర్శ హైస్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో తాగునీటి, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆరా తీశారు.

జ్యోతిబా పూలే పాఠశాల తనిఖీ..

మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ పాఠశాలను తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు, తరగతి గదులు, కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌కు సూచించారు. తహసీల్దార్ వెంట పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

గోపాలపూర్‌లో అగ్ని ప్రమాదం

- రూ. 5లక్షల ఆస్తి నష్టం



ఇంట్లో కాలిన వస్తువులు

కాటారం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో నిప్పంటుకొని వస్తువులు, నగదు, నిత్యావసర సరుకులు దగ్ధమైన సంఘటన మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపూర్‌లో మంగళవారం చోటు చేసుకొంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గం గట్టుమల్లు, కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా కూతురు స్పందన మధ్యాహ్న సమయంలో సమీపంలోని తెలిసిన వారి ఇంటి వద్దకు వెళ్లింది. ఈ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. గమనించిన వారు స్పందనకు సమాచారం ఇవ్వడంతో చుట్టుపక్కల వారి సహాయంతో మంటలు ఆర్పడానికి నీరు చల్లారు. దీంతో ఇంట్లోని ఫ్రిజ్ పేలి మంటలు మరింతగా వ్యాపించి కొంత నగదు, ఇంట్లో సామగ్రి, నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు గట్టుమల్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్‌కుమార్ (ఫైల్)

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన చిట్యాల మండలం లక్ష్మీపూర్‌తండా గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతనవేన అజయ్‌కుమార్ (24) వ్యక్తిగత పనుల నిమిత్తం చిట్యాల మండలం ఒడితల నుంచి మోరంచపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. లక్ష్మీపూర్ తండా గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే అజయ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

కాటారం: మనస్థాపంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపూర్ గ్రామానికి చెందిన జనగాం అశోక్(30)కు మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన కొండగొర్ల వనిత అలియాస్ రజితకు కొన్నేళ్ల క్రితం వివాహం కాగా మూడేళ్ల బాబు ఉన్నాడు. వనిత ఆరు నెలల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందగా వారి కుమారుడిని వనిత తల్లిదండ్రులు తీసుకెళ్లి పెంచుతున్నారు. ఈ క్రమంలో కట్నంగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని వనిత తల్లిదండ్రులు నారాయణ, లక్ష్మి, తమ్ముడు రంజిత్ అశోక్‌పై ఒత్తిడి తీసుకొచ్చి కొన్ని రోజుల క్రితం పంచాయతీ సైతం నిర్వహించారు. కట్నంగా ఇచ్చిన డబ్బులు చెల్లిస్తానని అశోక్ ఒప్పుకోగా సమయం దాటిపోయినప్పటికీ ఇవ్వలేకపోయాడు. తన కుమారుడిని తన వద్దకు పంపాలని పలుమార్లు అత్తమామను కోరాడు. డబ్బులు చెల్లించాలని అత్తమామ ఒత్తిడి, తన కుమారుడిని తనకు ఇవ్వడం లేదనే కారణాలతో అశోక్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 17న ఇంటి సమీపంలోని ఓ వాగు వద్ద పురుగుల మందు తాగాడు. కాగా, హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



రేగొండ: పరీక్ష సామగ్రి అందజేస్తున్న కిరణ్

మల్హర్: మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, వల్లెకుంటలోని జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు సపోర్ట్ ట్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష పాడ్లు, పెన్నులను అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు వీరమనేని సంపత్‌రావు, పేరాల వెంకటేశ్వరరావు, కామ సమ్మయ్య, చెన్నూరి దేవదానం, ఓల్లల రమేశ్, చిలకమారి వెంకటరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చల్లగరిగ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు నోముల వేణు, డాకురు రంజిత్, కొత్త శ్రీకాంత్ పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి మార్కులు సాధించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంతో పాటు, జగ్గయ్యపేటలోని పాఠశాలలో సత్తన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మొట్టె కిరణ్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు, స్కేలు, పెన్సిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు నాయకులు సూదనబోయిన ఓంప్రకాశ్, మేకల భిక్షపతి, కోలేపాక సాంబయ్య, పత్తి ప్రభాకర్, వీరబ్రహ్మం, పాతపెల్లి సంతోష్, వైనాల ప్రభాకర్, ఓమాజీ ఉపాధ్యాయులు కుమారస్వామి, గిరిధర కృష్ణ, రాజేందర్, మాధవితో పాటు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థి వేణు



తాడిచర్ల పాఠశాలలో..

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కాటారం: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకం ప్రారంభించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు దుర్గం రాజబాబు, నీలాల సమ్మయ్య, లింగయ్య, చిట్యాల చందు, సాగర్, మల్లయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న రఘు, వెంకన్న

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును ఆమోదించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రావడం వల్ల అర్హత ఉన్న వ్యక్తులకు ఉద్యోగాలు వస్తాయన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

- మండల ప్రత్యేకాధికారి వాల్యానాయక్



మాట్లాడుతున్న డీసీఓ వాల్యా నాయక్

చిట్యాల: విద్యార్థులు తరగతి గదుల్లో టీచర్లు చెప్పే పాఠాన్ని శ్రద్ధగా వింటూ చదువుకోవాలని డీసీఓ, మండల ప్రత్యేకాధికారి మాలోత్ వాల్యానాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. క్లాసులు ఏలా జరుగుతున్నాయని, భోజనం ఏలా పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ గొల్కొండ భిక్షపతికి సూచించారు. అలాగే పాఠశాలలోని రికార్డులను, డైనింగ్‌హాల్, శానిటేషన్, కిచెన్, స్టోర్ రూంలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ జయశ్రీ, ఉపాధ్యాయునులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మల్హర్: హాల్ టికెట్లు ఇస్తున్న ఉపాధ్యాయులు

- మాజీ ఎంపీపీ మల్హల్‌రావు

మల్హర్: పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ ఎంపీపీ మల్హల్‌రావు అన్నారు. మండలంలో పెద్దతూండ్ల జిల్లాపరిషత్ పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి మాజీ ఎంపీపీ హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ శర్మ, ఎండీ యాకూబ్ పాషా, ఐత మహేందర్, మానస, సవిత, సరిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్, ఉపాధ్యాయుడు రవీందర్, ఓఎస్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం: తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి వారి తల్లిదండ్రులుకు పాదపూజ నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం సరిత మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులు, గురువులకు పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, సరితా దేవి, వలిపాషా, శ్రీనివాస్ వసుదప్రియ, వీరేశం, లీలరాణి, ఫర్హానా కౌసర్, రజిత, షాహెద బేగం , ప్రసూనా, పూర్ణిమ, ఆంజనేయులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద చెత్తాచెదారం తొలగింపు



వాజేడు: మండల కేంద్రంలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన శివాలయం మూతపడింది. గ్రామంలో శివాలయం ఉండాలని గ్రామంలోని యువకులు ఒక టీమ్‌గా ఏర్పడ్డారు. మూతపడిన శివాలయాన్ని తెరిపించడం కోసం యువత ముందుకు వచ్చారు. గుడి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో స్వచ్ఛందంగా కదిలి వచ్చిన యువకులు, గ్రామస్తులతో కలిసి మంగళవారం చెత్తాచెదారం తొలగించారు. గుడి చుట్టు పక్కల పెరిగిన చెట్లను, పొదలను తొలగించి చెట్లను ట్రాక్టర్ సహాయంతో దూరంగా తరలించారు. డోజర్ ట్రాక్టర్ సహాయంతో గుడి ప్రాంగణాన్ని చదును చేశారు. గుడి విశిష్టతను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పునఃప్రారంభించడం కోసం ప్రయత్నం చేయనున్నట్లు యువకులు తెలిపారు.